# కక్కుర్తి కాశీపతి

సింగిల్ పేజీ కథ

భీమరాజు వెంకటరమణ

కమలాపురి కాలనీలో కార్నర్ హౌస్‌లో కాపురముంటున్న కామేశ్వరి తన ఎదురుగా కూర్చున్న భర్త కాశీపతిని కడిగిపారేస్తున్నది:

"కట్టుకున్న భార్యను నేను కాపురానికొచ్చి ఎంత కాలమైంది? కాసు బంగారమైనా కొనిచ్చావా?



కరెంటు కోత కదా అని కాస్త కిరోసిన్ తెమ్మంటే కొవ్వొత్తి ఒకటి కొని తెచ్చి కొన్ని వారాలైనా రావాలని కండిషన్ పెడతావా? కొడుకుకి కామెర్లు వచ్చి పనిమనిషి సాయమడిగితే కాన్సర్ వచ్చినట్లు కుమిలిపోతావేంటని కుళ్ళు జోకులేస్తావా?

కన్నకొడుకు కిషోర్ కాలేజీ ఫీజు కట్టాలని కంటికి నీళ్ళు పెట్టుకొని మరీ అడిగితే కన్ననాటి నుండి పెట్టిన ఖర్చు కాగితాలు కుప్పగా పోసి ఏకరువు పెడతావా?

కూతురు కవిత కలకత్తా నుండి కష్టపడి మనల్ని చూడాలని వస్తే కానీడబ్బులు కూడా చేతిలో పెట్టకుండా కబుర్లు చెబుతావా?

కూరలమ్మే కమలమ్మ దగ్గర కూడా కొత్తిమీర కమిలిపోయిందని, క్యాబేజీకి కన్నాలున్నాయని, కాకరకాయ కుళ్ళిపోయిందని కారణాలు చెప్పి డబ్బులు కట్ చేస్తావా?

కాలనీవాళ్ళు కొత్త సంవత్సరం వెల్కం పార్టీకి కంట్రిబ్యూషన్ అడిగితే కళ్ళెర్రజేసి కుదరదని చెబుతావా?

కావలసిన వాళ్ళ పెళ్ళికి కాకినాడ వెళితే కడుపునిండా తిని కవరులో కాసిని చిల్లర కాయిన్స్ పెట్టి కానుకగా ఇస్తావా?

కాపలా కాసే వీధికుక్క కాలిన కడుపుతో కనబడుతుంటే కాస్త కూడు పెట్టనీయకుండా నన్ను కసురుకుంటావా?

కాశీకి ఒకసారైనా తీసుకెళ్ళమని కన్నవారడిగితే, కాటికి కాళ్ళు చాపుకున్నవారికి కోర్కెలెందుకంటావా?

కరెంటు కోత కదా అని కాస్త కిరోసిన్ తెమ్మంటే కొవ్వొత్తి ఒకటి కొని తెచ్చి కొన్ని వారాలైనా రావాలని కండిషన్ పెడతావా?

కొడుకుకి కామెర్లు వచ్చి పనిమనిషి సాయమడిగితే కాన్సర్ వచ్చినట్లు కుమిలిపోతావేంటని కుళ్ళు జోకులేస్తావా?

కేదారీశ్వరి వ్రతం చేసుకుంటానని కోరిక కనబరిచినందుకు కారాలూ మిరియాలూ నూరి నా కంట తడి పెట్టిస్తావా?

కిరాయి కారులోనైనా ఒకసారైనా షికారు వెళదామంటే కారుకూతలు కూస్తే కాళ్ళిరగ కొడతానంటావా?

కొత్త బంగారులోకం సినిమా చూపించమని కాళ్ళు గడ్డాలు పట్టుకొని అడిగితే ప్రక్కింటి కౌసల్య చూసినట్లుంది కథ చెప్పించుకోమని ఇకిలిస్తావా?

కంచిపట్టు చీర కట్టుకోవడం కలలో మాటేనా అని అడిగితే "కాటన్ చీరలే నీ ముఖానికి కరెక్ట్" అని కేరింతలు కొడతావా?

కర్రకుర్చీ కాలు విరిగిపోయిందని కార్పెంటర్‌ను పిలవమంటే కొబ్బరితాడుతో దాన్ని కట్టి కళ్ళెగరేస్తావా?

కోటీకెళ్ళి క్లాత్ కొందామంటే కట్టి వదిలేసిన లుంగీలతో కర్టెన్లు కుట్టమంటావా?

కూరగాయలు పెట్టుకోవడానికి, కూల్ వాటర్ త్రాగటానికి చిన్న ఫ్రిజ్ కొనమంటే నీ ముఖానికి రెండు కుండలు కొంటాలే! అని సకిలిస్తావా?

కళ్ళు మంటలని, కంటిడాక్టరు దగ్గరకు తీసుకెళ్ళమంటే కాచిన నీళ్లతో కాపడం పెడితే ఖర్చు లేకుండా పోతుందంటావా?

కోర్టు పని మీద కాచిగూడ వెళ్ళాలని మా కోటేశ్వరరావు బాబాయి స్కూటరడిగితే తప్పించుకోవడానికి క్లచ్చివైరు ఏదో కట్టయిందని కారణాలు చెబుతావా?

కిడ్నీలు రెండూ చెడిపోయి మంచం పట్టిన మా కృపారావు మామయ్యను కలవాలని క్రిష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఖమ్మం వెళదామంటే రైలు కదిలిపోయేదాకా కడుపు నొప్పొచ్చిందని కాలయాపన చేసి కడసారి చూపు కూడా కలగనీయకుండా చేస్తావా?

కపటి, కఠినాత్ముడు, కసాయి, క్రూరుడు, కుటిలుడు అందరూ కలిసినా నీతో సమానమౌతారా?

కడుపు కట్టుకొని, కక్కుర్తి పడి కూడబెట్టి ఏం చేసావ్? కొండంత అత్యాశతో ఆ ఖుషీ బ్యాంకులో కుప్పపోసావ్! అదేమో కూలబడింది! నువ్వేమో కుర్చీలో కూర్చొని కుమిలిపోతున్నావ్! ఇప్పటికైనా కనువిప్పు కలిగిందా? కలిగినదానిలో కాస్త దాచుకున్నా కనీసపు అవసరాలకైనా ఖర్చు పెట్టుకోవాలని?"